## వీరేంద్రనాథ్ — వెన్నెల్లో గోదారి (1)

**జరిగిన కథ**

తరళా ఫెర్టిలైజర్స్ మేనేజింగ్ డైరెక్టర్‌కి ఓరాత్రి ఫోనొచ్చింది– వ్యభిచారుల ఇళ్ళమీద చేసిన రైడింగ్‌లో దొరికిన అమ్మాయి అతనికూతురు! ప్రేమంటే ఒకరికోసం మరొకరు చావటం అని మాత్రం తెలిసిన ఆమె, ఆరాత్రే గోదార్లో దూకేసింది! శోభనం రాత్రి తర్వాత చెంపపగిలేలా కొట్టిన భర్త! తప్పుచేసిన వాళ్ళని క్షమించలేని భార్య! ఇక చదవండి...

హడావుడిగా పరుగెత్తారు.

నా మెదడు మొద్దుబారుతున్నట్టు తోచింది. ఫోన్ పెట్టేస్తున్నప్పుడు ఆయన మొహ భంగిమ ఒక ఫొటోలా నామనసులో ముద్రితమైపోయింది.

ఇక ఇంట్లో ఒకక్షణం ఉండలేకపోయాను.

అక్కడ పోలీస్ స్టేషన్‌లో జరుగుతున్నదేమిటో తెలుసుకోవాలి. ఆయనకీ ఆ అమ్మాయికీ జరుగుతున్న సంభాషణ వినాలి.

మేడదిగి క్రిందికొచ్చాను. కారు ఆయన తీసుకెళ్ళారు. సాహితీ సాకేతల స్టాండర్డ్ వుంది. దాంట్లో బయల్దేరాను. అయిదు నిముషాలు అటు ఇటుగా బయల్దేరిన మా గురించి వాచ్‌మెన్ ఏమనుకున్నాడో

ఇనస్పెక్టర్ మాట్లాడిన ఒక వాక్యం నన్ను వెంటాడుతోంది! పోలీసుల దగ్గిర సాక్ష్యాల స్థితి తెలిపే వాక్యం అది! ఆలోచించేకొద్దీ కొత్త అర్థాలు స్ఫురించేవాక్యం అది. మామూలుసాక్ష్యం కాదు. నాభర్త నిజాయితీకి సంబంధించిన సాక్ష్యం అది.

పోలీసు స్టేషన్ దగ్గిరపడుతూంటే నాఅనుమానం నిజమైన సూచన్లు కనపడ్డాయి. రేపొద్దున్న కోర్టులో హాజరు పరచవలసిన అమ్మాయిని ఇనస్పెక్టరు ఆయనకి వప్పచెప్పుతున్నాడు. ఆయన ఆ అమ్మాయిని తీసుకొచ్చి కారు ఎక్కించాడు. రాత్రి మూడింటికి కారు ఆ నిర్మానుష్యమైన వీధుల్లో నెమ్మదిగా ఎక్కడికో వెళుతూంది.

కాస్త దూరంలో నేను అనుసరిస్తున్నాను. ఇనస్పెక్టర్ వాక్యానికి నా మనసులో ఇప్పుడు పూర్తిగా ఒక అర్థం రూపుదిద్దుకుంది.

''– ఫొటోతోపాటూ వేరేసాక్ష్యాలు ఇంకేమీలేవు. అనవసరంగా మాయస్సై ఇంతవరకూ తీసుకొచ్చాడు. అప్పుడే ఆఫొటో చింపేస్తే సరిపోయేది కదా.

ఆయన తన కూతుర్ని ఎక్కడికి తీసుకు వెళ్తున్నాడు?

ఫొటో చింపేసినట్టు ఇప్పుడు...

నా భర్తగురించి ఆవిధంగా ఆలోచించలేకపోయాను.

వ్యభిచార గృహంలో ఆ అమ్మాయి తల్లివుందా?

నా సవితి ?

అక్కడికి వెళ్తున్నారా ఇద్దరూ?

అయితే ఆ అపూర్వ సంగమంలో నేనూ వుండాలి. అటోఇటో తేల్చుకోవటానికి.

—— ఇంకావుంది.

కొమ్మూరి సాంబశివరావు సీరియల్ 'ప్రాక్టికల్ జోకర్' ఈ సంచికలో 20వ పేజీలో చదవండి.

## ప్రతిధ్వని

కథలు, సీరియల్సూ కాలక్షేపానికి చదువుకొనేవే అనే అభిప్రాయం, క్షణాల్లో మార్చుకోవాల్సి వచ్చింది యండమూరి 'వెన్నెల్లో గోదారి' చదివాక! మొదటి సంచిక మార్కెట్లో చూసాక వెంటనే కొని మొదటి భాగం చదివాను. ఇక రెండో భాగంలో తరళ ఏంచెబుతుందో అనే ఉత్కంఠని ఆపుకోలేక మల్లాదిగారికి నాలుగు సార్లు ఫోన్‌చేస్తే, నాలుగోసారి రెస్పాండ్ అయ్యారు. నా ఉత్కంఠని అర్థంచేసుకొని ఆఫీసుకు రమ్మన్నారు. వెళ్ళి రెండోభాగం చదివాను. నా కళ్ళు నిజంగానే చెమ్మగిల్లాయి. రెండో పనిమనిషిని కూడా తీసేస్తారేమో అనే అనుమానంతో 'సాహితి' మౌనం ప్రదర్శించిన తీరు సూపర్బ్! హేట్సాఫ్ టు యండమూరి!!

–రాయప్రోలు సుమతి, (నల్లకుంట)

## మినీ కథ — పడుచుదనం

రాధ...మోహన్‌లు ఇద్దరు పడుచుదనంలో యువతీయువకులు.

చల్లని పిల్లగాలులు వొళ్ళు నిమిరి సేదదీర్చుతున్న సమయం... చక్కని చీకటి సమయం...

రాధ పడమటిగుమ్మం పక్కనున్న స్విచ్‌నొక్కి లైట్ వెలిగించింది...

మోహన్ తూర్పుగుమ్మం పక్కనున్న స్విచ్‌నొక్కి దీపాన్ని వెలిగించాడు....

ఆ వెలుతుర్లో వొకరినొకరు ఆప్యాయంగా చూసుకున్నారు. మోహన్ గదిలోనికివెళ్ళి ప్యాంటు, చొక్కా తీసేసి, లుంగీ బనీనుతో వచ్చాడు....

రాధ ప్రక్క గదిలోకి వెళ్ళి, షిఫాన్ చీరా, జాకెట్టు తీసేసి, తెల్లటి నైట్ గౌన్ కట్టుకుని వచ్చింది. రాధ అద్దం ముందర నిలచి జుట్టుసర్దుకుని, ముఖానికి పౌడర్ రాసుకుని వొచ్చి మంచం కుడిప్రక్కన నిలుచుంది.



మోహన్ అద్దం ముందర నిలచి, క్రాపు దువ్వుకొని, అత్తరు రాసుకొని వొచ్చి మంచం ఎడంప్రక్కన నిలుచున్నాడు.

రాధా, మోహన్‌ల కళ్ళలో తొణికిసలాడుతున్న ప్రేమతో ఒకరిని ఒకరు చూసుకున్నారు ఆప్యాయంగా..,

రాధ సిగ్గుపడుతూ చిన్నగానవ్వి పడమటి గుమ్మంవగ్గిర స్విచ్‌నొక్కి దీపాన్ని ఆర్పేసి మంచంమీదకి వొరిగింది...

మోహన్ సిగ్గుపడుతూన్న రాధని చూసి నవ్వి, తూర్పు గుమ్మందగ్గిర స్విచ్‌నొక్కి దీపాన్ని ఆర్పేసి మంచం మీదకి ఒరిగాడు...

తరువాత...

మీరూహించినదేం జరగ లేదు. రాధా... మోహన్‌లు ఆరాత్రి ఒకరినొకరు తాకకుండా కలలుగంటూ నిద్రపోయారు... ఎందుకంటే. రాధ ఇల్లు మోహన్ ఇంటికెదురు...మోహన్ యిల్లు రాధ ఇంటికెదురు...

–శేడింబి శేషగిరిరావు.
(గోదావరిఖని)